వణికిస్తున్న మిచాంగ్

- తుపాను ప్రభావంతో గుబులు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- వేగంగా ధాన్యం కొనుగోలుకు చర్యలు

సీతానగరం: మిచాంగ్ తుపాను రైతన్నల గుండెల్లో అలజడి రేపుతోంది.. వాతావరణం మారి ఈదురు గాలులు, వర్షం పడుతుండడంతో ఇబ్బంది నెలకొంది. ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని, లాభాలు వస్తాయని అనుకుంటున్న పుడమి పుత్రులకు మిచాంగ్ తుపాను కష్టాలు తెచ్చిపెడుతోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో నియోజకవర్గంలోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆర్బీకే, సచివాలయ, వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతన్నలకు తోడుగా నిలిచారు. ఉదయాన్నే విధుల్లోకి చేరకుని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతులకు అవసరమైన సహాయం అందిస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలో సోమవారం ఉదయం నుంచి చిరు జల్లులు పడటంతో కళ్లాలపై ఉన్న ధాన్యం రాసులను వర్షం నుంచి రక్షించుకునేందుకు బరకాలు, టార్పాలిన్‌లు కప్పి తడవకుండా రైతులు తగిన రక్షణ తీసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు రెండు రోజుల కిందట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించారు. సీతానగరం మండలంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి పండించారు. అందులో పీఎల్ రకం వరి సుమారు 10 వేల ఎకరాలు ఉంటుంది. ఇందులో 2 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తిచేసి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా, కొంత వరకు ధాన్యం రాసులుగా ఉంది. మరికొంత ధాన్యం ఆర్బీకేల ద్వారా విక్రయించగా బస్తాలు పట్టి ఉంచారు. ఆ బస్తాలు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కోతలు కోయకుండా ఉన్న పంట పొలాల్లో గాలులకు వరి పంట పడిపోయింది.



సీతానగరంలో ధాన్యం బస్తాలపై బరకాలు వేస్తున్న రైతు



తంటికొండలో ధాన్యాన్ని రైసు మిల్లుకు తరలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



గండ్రేడులో రోడ్డు మీద నుంచి వర్షపు నీరు తొలగిస్తున్న కార్మికుడు

560 టన్నుల ధాన్యం తరలింపు

తుపాన్ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన మండలంలోని గ్రామాల్లో కొనుగోలు చేసిన 560 టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు తరలించారు. సోమవారం మండలంలోని ఉండేశ్వరపురం, ముగ్గళ్ల, చినకొండేపూడి, కాటవరం, వంగలపూడి, నల్గొండ, రఘుదేవపురం, సింగవరం, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ పొగిరి కృష్ణారావు, ఏఓ సూర్య రమేష్‌లు పర్యటించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రెండు రోజులు తుపాన్ ప్రభావం ఉంటుందని, వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. అదే విధంగా బస్తాలలో పట్టిన ధాన్యాన్ని మండల గ్రామాల నుంచి 20 లారీలలో యుద్ధప్రాతిపదికన రైస్‌మిల్లులకు అధికారుల పర్యవేక్షణలో తరలించారు. ఆర్ఐ లక్ష్మి, వీఆర్వో విజయశ్రీ, వీహెచ్ఏ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



పెదపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మణిదీప్

ఆందోళనలో అన్నదాతలు

బిక్కవోలు/పెదపూడి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను బలపడడంతో ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుపాను కారణంగా అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంట చేతికందే దశలో భారీ వర్షాలు పడడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో కోత దశలో ఉన్న పంట నేలవాలిపోవడంతో పాటు ముంపుబారిన పడుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ధాన్యం రాశులను కాపాడుకోవడానికి నానాహైరానా పడుతున్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

మిచాంగ్ తుపాను కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షాల కారణంగా ప్రజలు సోమవారం ఇళ్లకే పరిమితమయ్యారు. తుపాను కారణంగా ముందస్తు జాగ్రత్తగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు కార్యాలయాల్లో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. కళ్లాల్లో ఉండిపోయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టారు.



కొంకుదురులో వర్షానికి తడిసిన ధాన్యం రాసులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాను బలపడిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ టి.సుభాష్, మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ సూచించారు. సోమవారం వారిద్దరూ పెదపూడి, దోమాడ, కరకుదురు, పెద్దాడ గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ధాన్యం రాశులను వర్షం నీటిలో తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. తుఫాన్ ప్రభావం కారణంగా గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలో పెదపూడి, గండ్రేడు, కైకవోలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. మిచాంగ్ తుపాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో సచివాలయ కార్యదర్శులు, ఇతర అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో, రోడ్ల మీద నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.



ఉండేశ్వరపురంలో ధాన్యం బస్తాలను లారీలపై తరలిస్తున్న అధికారులు

ఎడతెరిపి లేని వాన

గోకవరం: మండలంలో సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. తుపాను కారణంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో మండలస్థాయి అధికారులు కార్యాలయాల్లో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. మండలంలో వరి పంట ఇప్పటికే కోతలు దాదాపు పూర్తికావడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. ధాన్యం తడిచిపోకుండా రైతులు బరకాలు కప్పి ఉంచారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశారు. మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పద్మావతి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఏఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

పలువురికి పరామర్శ



ఆకుల శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: పితృ వియోగంతో బాధపడుతున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనును ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

సీతానగరం: చినకొండేపూడిలో ఇటీవల గెడ్డం వెంకటేశ్వర్లు, బైర్రాజు భీమరాజు, బైరాజు రాముడు కళ్యాణ్ మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. పురుషోత్తపట్నం, సీతానగరం, రామచంద్రపురంలలో పలు కుటుంబాలను ఓదార్చారు. మండల పార్టీ కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, చల్లమళ్ల సుజీరాజు, కోలా శ్రీను, మునియ్య పాల్గొన్నారు.

కాపవరంలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు జ్ఞాపికలు అందజేస్తున్న సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో మానవసేవ మాధవసేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ ప్రారంభించారు. స్థానిక యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారెళ్ళ భీష్ముడు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా ఇంటింటా సర్వే ప్రారంభం



పందలపాకలో ఆడుదాం ఆంధ్రా పోస్టర్ అందిస్తున్న వలంటీర్

బిక్కవోలు: మండలంలోని ఆడుదాం ఆంధ్రా ఇంటింటా సర్వే సోమవారం ప్రారంభించారు. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 447 మంది వలంటీర్లు సర్వే చేస్తున్నారు. మొత్తంగా 47,609 మందిని సర్వే చేయాల్సి ఉండగా తొలిరోజు 13,831 మంది సభ్యులను అంటే 29.05 శాతం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పోస్టర్ అందజేశారు. ఈ నెల 15 నుంచి గ్రామ స్థాయి పోటీలు జరగనున్నాయి.

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దు



రఘుదేవపురంలో ఇటుక బట్టీని పరిశీలిస్తున్న సహాయ కార్మిక అధికారులు

సీతానగరం: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దని సహాయ కార్మిక అధికారులు కార్తీక్, జాబీన సూచించారు. సోమవారం చైల్డ్ లేబర్ ఫ్రీ ఇండియా డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిర్వహించారు. మండలంలోని పెట్రోల్ బంకులు, హోటళ్లు, సామిల్లులు, దుకాణాలు, ఇటుకల బట్టీలను పరిశీలించారు. పిల్లలను పనుల్లోకి పెట్టుకుంటే బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష పడుతుందని యజమానులకు వివరించారు. అనంతరం సీతానగరం విష్ణాలయంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఇతర కార్మికులతో సమావేశం నిర్వహించారు. 'ఈ-శ్రమ్'లో సుమారు 50 మందిని ఉచితంగా నమోదు చేశారు. సిబ్బంది ప్రవీణ్, వందన, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ఉత్సవాలకు ఆహ్వానం



నాగ శ్రీశయన్

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన టీవీ, సినీ బాల నటుడు నాగ శ్రీశయన్‌కు ప్రపంచ కళా సాహితీ ఉత్సవాలకు సోమవారం ఆహ్వానం అందింది. సాహితీ సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో ఈ నెల 16, 17 తేదీలలో 30 గంటల పాటు నిర్వహించే సాంస్కృతిక, సాహిత్య కళా యజ్ఞంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని నాగ శ్రీశయన్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు.

అనకాపల్లి నుంచి తిరుమలకు పాదయాత్ర

రాజానగరం: అనకాపల్లి నుంచి తిరుమలేశుని దర్శనానికి బయలుదేరిన 9 మంది గోవింద మాలధారులు, దీక్షబూనిన భక్తులతో కూడిన బృందం సోమవారం మధ్యాహ్నం సూర్యారావుపేటకు చేరుకుంది. వారికి చక్రద్వారబంధానికి చెందిన గోవింద దీక్షాధారు దుర్గారావు గోవింద్ ఆధ్వర్యంలో ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా పాదయాత్ర భక్తుడు యల్లపు వెంకటరమణ మాట్లాడుతూ అనకాపల్లిలోని నూకాలమ్మ గుడి వద్ద బుధవారం ఎనిమిది మంది బృందంగా పాదయాత్ర ప్రారంభించామన్నారు. పలు పర్యాయాలు పాదయాత్ర ద్వారా తిరుమలేశుని దర్శనం చేసుకుని వచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు పిల్లి సూర్యనారాయణ, మల్ల త్రినాథ్, బుదిర సత్యనారాయణ, వేగి సూర్యనారాయణతో పాటు గాడి నాయుడు, వేగి కోటేశ్వరరావు యాత్ర చేస్తున్నారన్నారు. కాగా అన్నవరంలో పాఠశాల హెచ్ఎం ముత్యాల నారాయణరావు కలిశారన్నారు. సుమారు 820 కి.మీ. దూరం ఉన్న తిరుమలకు రోజుకు 30 కి.మీ. చొప్పున పయనిస్తూ డిసెంబరు 23న ముక్కోటి ఏకాదశికి చేరుకునేలా ప్రణాళిక చేశామన్నారు. ఈ యాత్రలో దారి పొడవునా భక్తుల నుంచి లభిస్తున్న ఆదరణ మరువలేనిదన్నారు.



తిరుమలకు పాదయాత్ర చేస్తున్న శ్రీవేంకటేశ్వరుని భక్తులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

రాజానగరం: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ క్రీడా పోటీల్లో భాగంగా గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రిని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. పాల్గొనే అభ్యర్థుల వయసు 15 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామ సచివాలయ స్థాయిలో ఈ నెల 15 నుంచి 20 వరకూ, మండల స్థాయిలో 21 నుంచి జనవరి 4 వనరూ, నియోజకవర్గ స్థాయిలో 5 నుంచి 10, జిల్లా స్థాయిలో 11 నుంచి 21 వరకూ, రాష్ట్ర స్థాయిలో 22 నుంచి 25 వరకూ జరుగుతాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నాయకుడు మందారపు వీర్రాజు, డిప్యూటీ తహసీల్దార్ సునీత, ఎంఈఓలు రామనదొర, జ్యోతిప్రసాద్, పీఎస్‌లు, పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయాలకు మంజూరైన క్రీడా సామగ్రితో అధికారులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

సీతానగరం: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సోమవారం సీతానగరం భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్‌థెరిసా సేవా సమితి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాంగులకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో డాక్టర్ బాబు ఎప్పుడూ ముందు ఉంటారన్నారు. మదర్‌థెరిసా సేవాసమితి ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఎంఈఓలు కె.స్వామినాయక్, టి.ముత్యాలు, ఐఈఆర్టీ శివరామకృష్ణ, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రెడ్డి, పురంశెట్టి ప్రసాద్, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కోలా శ్రీను, మట్టా మునియ్య తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో విద్యార్థులకు దుస్తులు, విద్యా సామగ్రి అందిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల సేవలు ప్రశంసనీయం

అనపర్తి: ప్రపంచ శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల పాత్ర ప్రశంసనీయమని కాకినాడ చైతన్య గ్రూపుల సంస్థ చైర్మన్ చైతన్యరాజు పేర్కొన్నారు. అనపర్తిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చైతన్యరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లో మానవులను శాంతి మార్గం, ఆధ్యాత్మికత వైపు పయనించేలా చేస్తున్న బ్రహ్మకుమారీల మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాజానగరం గైట్ కళాశాల ప్రాంగణంలో తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభలకు మూడు లక్షల మంది హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే రజని మాట్లాడుతూ బ్రహ్మ బాబా చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ పయనిస్తూ శాంతి, దయ, ప్రేమతో జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ ఎం.కేశవరాజు, స్థానిక సేవా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే సుశీల, పీవీ కృష్ణంరాజు, డాక్టర్ ఎస్ఎస్ఎన్ రాజు, ఎంఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సత్తి రామారెడ్డి పాల్గొన్నారు.



చైతన్యరాజుకు జ్ఞాపికను బహూకరిస్తున్న బ్రహ్మకుమారీలు

వరి కోతలు చేపట్టవద్దు

రాజానగరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలో ఎటువంటి నష్టం వాటిల్లలేదని తహసీల్దార్ పవన్‌కుమార్ అన్నారు. అయితే తుపాను ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని, ఖరీఫ్ పంట కోతలు కోయాల్సిన రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇప్పటికే మండలంలో 90 శాతం వరి పంట కోతలు పూర్తయ్యాయని, ఆర్బీకేల ద్వారా ఇప్పటికే ధాన్యాన్ని కొనుగోలు చేయించామన్నారు. ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేయించామన్నారు. మిగిలిన 10 శాతం రైతులు ఈ సమయంలో కోతలు చేపట్టవద్దని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి శిబిరాలను సోమవారం నిర్వహించారు. 274 మందికి డాక్టర్లు యన్నమనేని రామచంద్రరావు, సత్యం రమేష్‌బాబు, రాయుడు శ్రీనివాస్ వైద్య సేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం ఆధ్వర్యంలో 208 మంది రోగులకు, పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పోలినాటి ఈశ్వరుడు, ఎ.నరసింహం, శ్రీమందపాటి జగపతిరాజు, జి.నరసింహారావు, వై.రవీంద్రలు వైద్యులకు, రోగులకు భోజన ఏర్పాట్లు చూశారు. ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, కె.శ్రీనివాసరావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వాయిదా

గోకవరం: గోకవరంలో సోమవారం నిర్వహించతలపెట్టిన నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా పడింది. తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండగా క్రిస్మస్‌ను ఆదివారం నిర్వహించనున్నట్లు పాస్టర్ ఫెలోషిప్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నబాబు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: విభిన్న ప్రతిభావంతులను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాల్సిన అవసరముందని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు స్వశక్తితో జీవనం సాగించేలా వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారికి దాత బాబూరావు సౌజన్యంతో అన్నదానం చేయగా, దాతలు చావలి శ్రీనివాస్, సత్తి పోతారెడ్డిల సహకారంతో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు పుష్పలత, నల్లమిల్లి సత్తిరెడ్డి, ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ టీచర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెందుర్తికి పితృ వియోగం

సీతానగరం: రాజానగరం నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తండ్రి పెందుర్తి రామచంద్రరావు (86) ఆదివారం రాత్రి మరణించారు. ఆయన ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య రామలక్ష్మి, కుమారుడు మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, కుమార్తె నాగరత్న కుమారి ఉన్నారు. మరణాంతరం తన శరీరాన్ని మెడికో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉంచాలనే కోరిక మేరకు సోమవారం ఉదయం ఆమర పార్థివ దేహాన్ని దివాన్‌చెరువు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేష్‌ను పలువురు ప్రముఖులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సీతానగరంలో వెంకటేష్ నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించి, సంతాపం తెలిపారు.



సీతానగరంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేష్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు



ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి



చంద్రేడులో ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

బిక్కవోలు: కార్తిక మాసం మూడో సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామికి లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కొంకుదురు, పందలపాక, ఊలపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కార్తిక పూజలు నిర్వహించారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి సోమవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని సింగంపల్లి, రంగంపేట, సుభద్రంపేట, దొంతమూరు, వడిశలేరు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గోకవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

గోకవరంలో..

గోకవరం: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలు వెలిగించారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి, కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అలరారిన శివాలయాలు

అనపర్తి: నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర అంటూ మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో అలరారాయి. సర్వం శివోహం అన్నట్లుగా గామాల్లో ఎక్కడ చూసినా శివనామస్మరణే కన్పించింది. కార్తికమాసం మూడో సోమవారం కావడంతో శివాలయాలు వేకువజామున 3 గంటల నుంచే భక్తులతో పోటెత్తాయి. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అనపర్తి, రామవరం, కుతుకులూరు, పెడపర్తి, పులుగుర్త తదితర శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక భావన రుషి ఆలయంలో శ్రీవ్యాఘ్రేశ్వరస్వామిని నయనానందకరంగా అలంకరించారు. పరమపావనుడైన రుద్రుడికి భక్తులు పంచదార, తేనె, పసుపు, కుంకుమ, విబూది, చందనం, పాలు, పెరుగు, ఆవునెయ్యి పండ్లరసాలు తదితర పదార్థాలతో అభిషేకించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేకువజామున భక్తులతో ప్రారంభమైన క్యూలైన్లు ఉదయం 10 గంటల వరకూ కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాస దీక్షను చేపట్టిన పలువురు మహిళా భక్తులు సాయంత్రం సమయాల్లో పురోహితులకు స్వయంపాకం అందజేసిన అనంతరం ఉపవాసదీక్షను విరమించారు. స్వయంపాకంతో పాటు కొందరు దీపాలను దానం చేశారు. ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలను వెలిగించడంతో ఆలయాలు దీపశోభను సంతరించుకున్నాయి. దీపశోభతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. మహిళలు బియ్యం, కూరగాయలు, కంద పిలకలు తదితర పదార్థాలను అర్చకులకు స్వయంపాకంగా అందజేశారు.



అనపర్తి భావనరుషి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వ్యాఘ్రేశ్వరస్వామి